# సేల్స్‌మెన్ —హిమజారమణ

ఎంత చదివినా... ఎంత తెలివి తేటలున్నా ఆఖరికి మోహన్ సంపాదించ గలిగింది ఓ బట్టల షాపులో సేల్సు మెన్ ఉద్యోగం.



రోజంతా షాపులో కూర్చుని చీరెలు, జాకెట్ పీస్‌లు... అమ్మడమే అతని పని. ఆ షాపు యజమాని వెంకటరత్నం చాలా నిక్కచ్చి మనిషి. ఆయనకు బెంగుళూరులో పెద్ద పట్టు చీరల షాపుంది. ఎక్కువగా వెంకటరత్నం బెంగుళూరు షాపులోనే వుంటాడు.

ఉద్యోగం ఇస్తూ ''చూడు మోహన్! నాకు ముఖ్యంగా కావలసింది నిజాయితి. నిన్ను చూస్తుంటే నమ్మకస్తుడిలాగే కనిపిస్తున్నావ్. అయితే కొన్ని నెలలు నీ ప్రవర్తన చూసి గానీ నీ పైన నేను తృప్తి చెందను. ఇవన్నీ ఎందుకు చెబుతున్నానంటే ఇంతకు ముందున్న శంకర్రావ్ నన్ను నమ్మించి డబ్బూ, చీరలతో సహా ఉడాయించాడు. నిజాయితీగా పని చేస్తే ఈ ఉద్యోగంలో నీకు మంచి జీతం వుంటుంది...''

అంటూ చెప్పాడు.

ఆ మాటలు మోహన్‌కు ఎప్పుడూ గుర్తుంటాయి. తన నిజాయితీ మీద, తన పని మీద తనకు నమ్మకం వుంది గనుకనే (అసలే కరవు రోజులు) ఆలోచించకుండా సేల్సు మెన్‌గా చేరి పోయాడు.

అతి కొద్ది రోజులలోనే వ్యాపారంలోని చిన్న చిన్న ట్రిక్స్‌కూడా నేర్చుకుని, వచ్చిన కస్టమర్స్‌తో ఓపికగా మాట్లాడి అమ్మకాలు బాగానే పెంచేశాడు.

ఇలాగే బాస్‌ను ఒప్పించేసి కాస్త ఎక్కువ జీతం డిమాండ్ చేసి ఆ తర్వాత పెళ్ళి చేసుకొని జీవితంలో స్థిరపడదామని మోహన్ నిర్ణయం.

ముందు, ముందు నెలసరి అమ్మకాన్ని బట్టి కమీషన్ కూడా ఇస్తానంటూ వెంకటరత్నం దగ్గర్నుంచి వచ్చిన చిన్న కార్డు అందుకొని 'హుర్రే' అనుకున్నాడు బి.కాం. పాసయిన చీరల షాపు సేల్సు మెన్ అయిన మోహన్.

* * *

ఆ రోజు ఉదయం ఎనిమిదిన్నరకు షాపు తెరచి అగరొత్తులువెలిగించిన రెండు నిముషాల లోనే ఓ అమ్మాయి ప్రవేశించింది. ''బోణీ బేరం పైనే ఆ రోజు వ్యాపారమంతా ఆధారపడి వుంటుందని వ్యాపారస్థుల నమ్మకం.

'ఇంత అందమయిన అమ్మాయి బోణీ వలన ఈ రోజు వ్యాపారం బ్రహ్మాండంగా వుంటుందని' మోహన్ మనసులోనే సంతోషించాడు.

ఆ వచ్చిన అమ్మాయి మామూలు కాటన్ శారీ ఒకటి సెలెక్టు చేసింది. ఆమెకా రంగు అంత బాగుండదని చెబుదామనుకున్నాడు. కానీ కస్టమర్స్‌కు సేల్సు మెన్స్ అభిప్రాయాలతో అభిరుచులతో అవసరం లేదు.

మోహన్ చీర ప్యాక్ చేస్తున్న సమయంలో ఘాటయిన సువాసన అతని ముక్కు పుటాలకు సోకింది. ఖరీదయిన పరిమళం,ఉదయాన్నే అందమయిన అమ్మాయి షాపుకు రావడం, ఆమెతో బాటె హాయిని గొలిపె పరిమళం సోకడం, మోహన్‌ని కాస్త ఊహాలోకంలో క్షణ కాలం విహరించేట్లు చేసాయి.

అరవై రూపాయిలు బిల్లయ్యింది. ఆమె తన హ్యాండ్ బ్యాగ్‌లో నుండి కొత్త వంద రూపాయిల నోటు ఇచ్చింది. మోహన్ వెంటనే దాన్ని అందుకొని నలభై రూపాయిలు వాపసు చేశాడు.

'చిల్లర లేనందువలన కస్టమర్ ఇబ్బంది పడ కూడదు.'

ఇది బాస్ వెంకటరత్నంగారి హెచ్చరిక గుర్తొచ్చింది. అందుకే మోహన్ క్యాష్ బాక్స్‌లో వంద రూపాయిలుకు సరిపడా చిల్లర వుంచుకుంటాడు.

వెళ్ళే ముందు ఆ అమ్మాయి చిన్నపాటి నవ్వు

నవ్వి వెళ్ళిపోయింది. ఆ షాపులోని చీరలన్నీ ఉచితంగా ఇవ్వచ్చుని పించిందామె నవ్వుకి.

ఆ వెంట ఓ పది నిముషాల అనంతరం ఒక నడి వయసు స్త్రీ షాపులో ప్రవేశించింది. ఆవిడ లోపలికి రాగానే మోహన్ గ్రహించినదేమంటే ఈవిడ రాసుకున్న సెంటు పరిమళం. ఆ అమ్మాయి రాసుకున్న సెంటు పరిమళం రెంటి సువాసనా ఒకటే. ఆ విషయాన్ని పసిగట్టిన మోహన్ తన నాసికను తను అభినందించుకున్నాడు. తాను కూడా సూక్ష్మగ్రాహి అవుతున్నందుకు రవ్వంత ఆనందపడిపోతూ.

ఆవిడను చూస్తుంటే మోహన్‌కు ఎందుకనో ఏదో అనుమానం ప్రవేశించింది. చీరలు చూపిస్తూ ఆవిడ ముఖంలోకి పరిశీలనగా చూశాడు. అంతకు ముందు ఉదయాన్నే వచ్చి వెళ్ళిన అమ్మాయి పోలికలు స్పష్టంగా కనిపించాయి.

'కొంపదీసి వీళ్ళిద్దరూ ఒకే కుటుంబానికి చెందిన వాళ్ళు కాదు గదా!'

కొద్ది రోజుల క్రితం ప్రక్క షాపులో జరిగిన సంఘటన గుర్తొచ్చింది. ఇదే విధంగా ఉదయాన్నే ఓ అమ్మాయి వంద రూపాయిల నోటు ఇచ్చింది. ఆమె వెళ్ళిన కాస్సేపటికే ఇంకో స్త్రీ వచ్చి చీర తీసుకొని అసలు డబ్బేమీ ఇవ్వకుండానే చిల్లర అడిగింది.

షాపువాడు అసలు డబ్బే యివ్వలేదని వాదించాడు.

ఆమె ఇచ్చానంటూ అరిచింది.

వాడు యివ్వలేదంటూ మొత్తుకుంటాడు.

ఆ గోలకి నలుగురూ పోగయ్యారు. ఆమె పెద్ద మనుషులుగా వచ్చిన వారితో తాను వంద రూపాయిల నోటిచ్చాననీ, కాటన్ శారీ అరవై రూపాయిలు పోను మిగతా చిల్లర షాపు వాడు ఇవ్వకుండా తనని మోసం చేస్తున్నాడంటూ కావలిస్తే వంద నోటు నంబర్ కూడా చూడమని నంబర్ చెప్పింది.

క్యాష్ బాక్స్‌లో వున్న వంద నోటు నంబర్ ఆమె చెప్పిన నంబరూ ఒక్కటే. ఇంకేముంది షాపు వాడు ఏడుపు ముఖం పెట్టి, కిక్కురుమనకుండా చిల్లర యిచ్చి పంపించాడు.

ఆ షాపులో జరిగిన సంఘటన మోహన్ మనసులో మెదిలి ఒళ్ళు జలదరించింది. కొంపదీసి ఇప్పుడు తన మీద కూడా ఇదే విధమయిన ట్రిక్ ప్రయోగింప బడటం లేదు కదా!

అయినా అంత అందంగా నవ్విన అమ్మాయి మోసగత్తె అయి వుంటుందా? ఏమో!... తన జాగ్రత్తలో తానుండటం మంచిదనిపించింది. బుర్ర వేగంగా ఆలోచించడం మొదలుబెట్టింది.

ఆవిడ వేపు చూశాడు. చీరెలు చూడ్డంలో మునిగి వుంది. మోహన్ వెంటనే క్యాష్ బాక్స్ దగ్గరి కెళ్ళి వంద రూపాయిల నోటు తీసి ఒక కవరులో పెట్టి బయటకు వచ్చి దగ్గర్లో వున్న టీ బంకులో పని చేస్తున్న కుర్రాడ్ని పిలిచి

"ఈ కవర్ అవతలి బజారులో వున్న అంబికా షోరూంలో పని చేస్తున్న రాఘవ రావ్‌కి ఇచ్చేసిరా!"

అని చెప్పి వచ్చేశాడు. అంబికా షోరూంలో పని చేసే రాఘవరావ్ మోహన్‌కు మేనమామ కొడుకు.

తేలిగ్గా ఊపిరి పీల్చుకుంటూ మరో రాక్‌లో వున్న గాంధి కాటన్ శారీస్, ఇంకా వెరయిటీ చీరెలూ ఆవిడ ముందేసి

"ఇవి చూడండి. వీటిల్లో మీకు తప్పకుండా నచ్చుతాయి." అంటూ నవ్వుతూ చెప్పాడు.

ఆవిడ కూడా నవ్వుతూనే నాలుగు రకాలు తిరగేసి ఓ చీర సెలెక్టు చేసుకుని ప్యాక్ చేయించుకుంది.

తొంభై రూపాయిలు ఆవిడ తీసుకున్న చీరకు చెల్లించింది. ఆవిడ అన్నీ పది రూపాయిల నోట్లిచ్చింది. మోహన్ ఆ నోట్లని జాగ్రత్తగా పరిశీలించాడు. అన్నీ కొత్త నోట్లు. తనూహించిన దానికి వేరేగా జరిగింది. తను అనవసరంగా భయపడి పాపం 'వీళ్ళని' మోసగత్తెలుగా అంచనా వేసినందుకు సిగ్గేసింది.

షాపు తెరచిన అరగంటలోనే మూట యాభై రూపాయిలు బేరం అయినందుకు సంతోషమేసింది.

ఓ గంట సేపయిన తర్వాత ఇంతలో షాపు యజమాని వెంకటరత్నం వస్తూ కనిపించాడు.

'ఈయన ఈ ఊరు ఎప్పుడొచ్చాడా!' అనుకొంటూ ఆయన షాపులోకి వచ్చి కూర్చోగానే నిదానంగా అమ్మకాల అభివృద్ధి గురించి వివరించాడు. ఇంకా స్టాక్ పంపించమంటూ చెప్పాడు.

వెంకటరత్నం తాపీగా మోహన్ వంక చూస్తూ.

"ఫర్వాలేదు. బిజినెస్ బాగానే డెవలప్ చేస్తున్నావ్. స్టాక్స్‌లో ఇంకా వెరయిటీలు పంపిస్తాను. నీ మీద నాకిప్పుడే నమ్మకం కుదురుతోంది." అన్నాడు.

ఆయనింకా తన నిజాయితీని శంకించడం మోహన్‌కు బాధేసింది.

"మీ నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను."

అన్నాడు వినయంగా.

"వ్యాపారంలో, ముఖ్యంగా డబ్బు రోజూ చేతికి వచ్చే ఇటువంటి బిజినెస్‌లో ఎవరినీ ఖచ్చితంగా నమ్మడానికి వీల్లేదు. డబ్బు మనిషిలోని కోరికలనూ, బలహీనతలనూ రెచ్చగొడుతుంది. ఇంతకుముందు పని చేసిన శంకర్రావ్ ఎక్కువ చీరలు అమ్మి తక్కువ డబ్బు జమకట్టేవాడు. మిగిలిన డబ్బు జేబులో వేసుకునే వాడు. స్టాక్ చెకింగ్‌లో మాత్రమే ఈ విషయం బయట పడుతుంది. నువ్వేమీ అనుకోవద్దు. ఇప్పుడు ఫార్మాలిటీగా స్టాక్ చెక్ చేస్తాను." అన్నాడు వెంకటరత్నం.

ఒక గంట లోపలే స్టాక్ చెకింగ్ పూర్తయింది. ఆఖరి జాకెట్ పీస్‌తో సహా ఆ చిన్న షాపులోని స్టాక్ లెక్క సరిపోయింది. వెంకటరత్నం పూర్తిగా సంతృప్తి పడినట్టు కనిపించాడు.

చిరు నవ్వు నవ్వుతూ "చూడు మోహన్! నువ్వు కస్టమర్స్‌తో ప్రవర్తించిన తీరు నాకు బాగా నచ్చింది. నీ గురించి తెలుసుకుందామనే ఇంతకు ముందు మా అమ్మాయినీ, నా భార్యనీ పంపించాను. వాళ్ళు నీ ప్రవర్తన వ్యాపార ఆసక్తి గురించి మెచ్చుకున్నారు. నాకు చాలా హ్యాపీగా వుంది. ఇప్పుడు ఫార్మాలిటీగా క్యాష్ చెక్ చేస్తాను."

అంటూ క్యాష్ బాక్స్ తెరిచాడు. అంతే. ఆయన చెప్పిన చివరి మాటలు వింటూనే మోహన్ గుండె కొట్టుకోవడం మానేసినట్లయింది.

క్యాష్ బాక్స్‌లో వంద రూపాయిల నోటు లేకపోవడం చూసి, లెక్క పెట్టి క్యాష్ స్టాక్‌తో సరి చూసి మోహన్ వేపు సీరియస్‌గా చూస్తూ క్యాష్ బాక్స్ తపీమంటూ మూసేసాడు.

"నీ నిజాయితీ నా కర్థమయ్యింది."

మోహన్ వేపు సూటిగా చూస్తూ అడిగాడు వెంకటరత్నం. ఆయన కంఠంలో రవ్వంత బాధ కూడా వినిపించింది.

మోహన్‌కు తల గిర్రున తిరుగుతున్నట్లనిపిస్తోంది. జరిగింది వివరించాలని కూడా అనిపించలేదు. పైగా కూతురూ, భార్యలను మోసగత్తెలని అనుమానించానని చెబితే మరింతగా మండి పడతాడు...

అందుకే మర్యాదగానే... తొలగించబడ్డాడు.

బి.కాం. పాసయి కనీసం బట్టల కొట్లో సేల్సు మెన్‌గా రాణించ లేకపోవడం తన నిజాయితీలో లోపమో, లౌక్యం లేని అతి తెలివో ఇప్పటికి అర్థం కాలేదు మోహన్‌కి.

అందుకే ఈసారి... సేల్సు మెన్ కాని ఉద్యోగాల అన్వేషణలో మునిగిపోయాడు.